


# పళ్లెము

దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక!

1. పగతో కూడిన పళ్ళెం : Matthew(మత్తయి సువార్త) 14:8

   అప్పుడామె తన తల్లిచేత ప్రేరేపింపబడినదై బాప్తిస్మమిచ్చు యోహాను తలను ఇక్కడ పళ్లెములో పెట్టినా కిప్పించుమని యడిగెను.

అన్న భార్యను ఉంచుకోవడం న్యాయం కాదు అని బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పినందుకు హేరోదు రాజు అతని చెరసాలలో వేయించాడు. అతని పై కక్ష్య కట్టిన హేరోదియ (హేరోదు అన్న భార్య) కుమార్తె చేత హేరోదు రాజు జన్మ దినంలో నాట్యం వేయించింది. ముగ్ధుడైన హేరోదు రాజు హేరోదియ కుమార్తెను ఏం కావాలో కోరుకోమంటే, ఆ యౌవనస్థురాలు బాప్తీస్మమిచ్చు యోహానును తల గొట్టించి పళ్ళెంలో పెట్టి ఇప్పించమంది. రాజు ఆలాగే చేయించాడు.

తల్లి ఎట్టిదో బిడ్డ అట్టిదే అని వాక్యం చెబుతుంది. తల్లి వేశ్య అయితే కుమార్తె మంచిదిగా ఎలా తయారవుతుంది. తల్లి ఆ కుమార్తెకు చిన్నప్పటి నుండే తండ్రి నుండి దూరం చేసి చిన్నాన్నే తండ్రి అని నేర్పించింది. ఒకవేళ తండ్రి లేకపోతే దైవ సేవకుడు తండ్రి స్థానంలో ఉండాలి కాని, అమ్మను ఉంచుకున్న వాడు తండ్రి ఎలా అవుతాడు?

వ్యభిచార స్త్రీలు ఎప్పుడు దైవ సేవకులను చంపేస్తూ ఉంటారు. పాత నిబంధనలోని యెజెబెలు అయినా, క్రొత్త నిబంధన లోని హేరోదియ అయినా లేక మనం ఈనాడు TV ల్లో, వార్తా పత్రికల్లో చూస్తున్న వ్యభిచార స్త్రీలు ప్రియుడుతో, విటుడితో కలిసి భర్తను చంపించడం.

2. అపవిత్ర పళ్ళెం: Matthew(మత్తయి సువార్త) 23:25

   అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యు లారా, మీరు గిన్నెయు పళ్లెమును వెలుపట శుద్ధిచేయుదురు గాని అవి లోపల దోపుతోను అజితేంద్రియత్వముతోను నిండియున్నవి.

ప్రభువు శాస్త్రులను, పరిసయ్యులను చూచి పైకి మీరు మంచిగా కనబడతారు. లోన కుళ్ళు, కుతంత్రాలు ఉన్నాయి. మీరు వేషదారులని గద్దించారు. మేడి పండు పైకి మేలిమై, లోన పురుగు ఉన్నట్లు మనం ఈ అపవిత్రత అనే పళ్ళెం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వారితో చేరితే నాలుగు రోజుల్లో మనలను కూడా అలా తయారు చేస్తారు. ప్రభువుని సిలువ వేసిందంతా ఈ అపవిత్రులే.

3. వేషధారణ పళ్ళెం: Matthew(మత్తయి సువార్త) 27:24

   పిలాతు అల్లరి ఎక్కువగు చున్నదే గాని తనవలన ప్రయోజనమేమియు లేదని గ్రహించి, నీళ్లు తీసికొని జనసమూహము ఎదుట చేతులు కడుగుకొని ఈ నీతిమంతుని రక్తమునుగూర్చి నేను నిరపరాధిని, మీరే చూచుకొనుడని చెప్పెను.




పిలాతు చేయవలసినదల్లా చేసి, యేసును సిలువ వేయించి, జనులను సంతోష పెట్టాలని నిర్ణయించి, తనకేం సంబంధం లేనట్లుగా  పళ్ళెంలో నీళ్ళు తెప్పించి చేతులు కడుక్కొని నేను నిరపరాధిని అన్నాడు. ఇంతకు ఇలాంటి వేషధారికి అంత మంచి భార్య (ప్రభువుని గూర్చి కలలో కూడా బాధపడే భార్య) ఎలా దొరికిందో?

*4.* పరిచర్య పళ్ళెం:    John(యోహాను సువార్త) 13:5

**అంతట పళ్లెములో నీళ్లు పోసి శిష్యుల పాదములు కడుగుటకును**, తాను కట్టుకొనియున్న తువాలుతో తుడుచుటకును మొదలుపెట్టెను.

లోకంలో రకరకాల పళ్ళాలు వాటిని నింపే పదార్థాలు మనం చూస్తున్నాం. కాని, ప్రభువు చేతిలో పళ్ళెం, పళ్ళెంలో నీళ్లు, పై వస్త్రాన్ని తీసివేసి తువాలును నడుముకు కట్టుకొని శిష్యుల పాదాలు కడగడం ప్రారంభించారు. అందరికి అదోలాంటి భయం, బాధ.  అప్పటికే ఆయన మరణాన్ని గూర్చి శిష్యులకు చెప్పారు. ప్రభువా! నా పాదాలు మీరు కడగటమా? అని పేతురు ప్రశ్నించాడు. నేను నిన్ను కడగకపోతే నీతో నాకు పాలు లేదు అన్నారు. అలాగైతే పూర్తిగా కడగమన్నారు. స్నానం చేసిన వారు మరల పూర్తిగా కడగబడనవసరం లేదన్నారు ప్రభువు.

ప్రతి శిష్యుని పాదాలు కడిగి, తువ్వాలుతో తుడిచి, బోధకుడనైన నేను ఎలాగు చేశానో, మీరును ఒకరికొకరు ఆలాగు చేయండి. మీలో ఎవరు గొప్పవారై ఉండాలో వారే పరిచర్య చేయాలని శిష్యులకు బోధించారు.ఈ సత్యాన్ని గ్రహించిన శిష్యులు మరెన్నడు తమలో ఎవరు గొప్ప అనే ప్రశ్నను తర్కించలేదు.

నిజంగా పరిచర్య చేసేవాడు గొప్పలకు పోడు. గొప్పలకు పోయేవాడు నిజమైన పరిచర్య చేయలేడు.

Lent లో పరిచర్య మనమందరము మన మందిరాలలో నేర్చుకొని వాటిని మన కుటుంబాలలోకి  విస్తరింపచేయడానికి పరిశుద్ధాత్మ దేవుడు సహాయం దయ చేయును గాక! ఆమేన్...! ఆమేన్...! ఆమేన్...!